కడియం : శ్రీసత్యదేవా నర్సరీలో సంక్రాంతి శోభ

కేశవరం ఫ్లైఓవర్

- వంతెన నిర్మాణం ఎప్పటికో?
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- త్వరితగతిన వంతెన నిర్మించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా ఉండే మండలంలోని కేశవరం ఫ్లైఓవర్ నిర్మాణం ఎప్పటికి జరుగుతుందోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏళ్లు గడుస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణం జరగకపోవడంతో ప్రయాణికులు, గ్రామ ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట మధ్య గల రైల్వే లైనులోని ఈ స్టేషన్ మీదుగా ప్రతిరోజు సూపర్ పాస్ట్, ఎక్స్‌ప్రెస్, పాసింజర్స్, గూడ్స్ వంటి సుమారు 100 నుంచి 110 రైళ్లునిత్యం పరుగులు తీస్తుంటాయి. రాజమహేంద్రవరం, బొమ్మూరు హైవేలకు చేరుకునేందుకు ఈ మార్గం దగ్గర కావడంతో పాటు పుణ్యక్షేత్రం, రాజానగరం తదితర గ్రామాలకు ఈ రోడ్డు ప్రధాన మార్గం అయిన నేపథ్యంలో ప్రజలు ఈ రోడ్డును వినియోగిస్తుంటారు. గ్రామం నుంచి రోడ్డు చెంతనే ఉన్న బస్టాండ్‌కు రావడానికి రైల్వే గేటు దూరంగా ఉండటంతో ప్రజలు రైల్వే పట్టాలను దాటుకుని వెళుతుంటారు. ప్రతి 10 నుంచి 15 నిమిషాలకు రైల్వే గేటు పడు తుండటం, రెండు మూడు రైళ్లు ఒకేసారి వెలుతుండటంతో సుమారు అరగంట సేపు గేటు మూతపడి ఉంటుండటంతో ప్రయాణికులు, ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి గేటు మూసి ఉంటున్న నేపథ్యంలో ఎండకు ఎండి వానకు, దుమ్ము, దూళికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. గేటు తెరచిన తరువాత కూడా కొన్నిసార్లు మరో 5 నుంచి 10 నిముషాల వరకు ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితులలో ఆసుపత్రికి వెళ్లేవారు అష్టకష్టాలు పడుతున్నారు.

రైల్వే గేటు వేయడంతో నిలిచిన వాహనాలు

కొన్ని సమయాల్లో 108 వాహనం కూడా ఈ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతుందంటే పరిస్థితి ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కనీసం సమీపంలోని స్టేషన్‌లోను కాలినడక వంతెన లేకపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. ఇది ఇలాఉండగా ఇటీవల కాలంలో ఇక్కడ కనీసం పాసింజర్ రైళ్లకు హాల్ట్ లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు అటు ద్వారపూడి ఇటు రాజమహేంద్రవరం వెళ్లి ఎక్కాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఈ విషయంపై మండపేట తహశీల్దార్ టిఆర్.రాజేశ్వరావును వివరణ కోరగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఫ్లైఓవర్ నిర్మాణం కోసం సర్వే చేసి ఉన్నాతాధికారులకు అందజేసామన్నారు

ట్రాఫిక్‌తో అవస్థలు పడుతున్నాం

ప్రతి 10 నుంచి 15 నిమిషాలకు రైల్వే గేటు పడుతోంది. రెండు మూడు రైళ్లు ఒకేసారి వెళుతుండటంతో సుమారు అరగంట సేపు గేటు మూతపడి ఉంటోంది. దీంతో రైల్వే గేటు తెరచిన అనంతరం ట్రాఫిక్ క్లియర్ అవ్వడానికి మరింత సమయం పడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రులకు తరలించేందుకు ఇబ్బందులు పడు తున్నాము.

-ఎస్.మాచర్రావు, సిఐటియు నాయకులు, కేశవరం

పట్టాలు దాటుతున్న స్థానికులు

త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

రైల్వే గేటు పడిందంటే కొన్ని సమయాల్లో గంటసేపు వరకు నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో సమయం అంతా వృథా అవుతోంది. వర్షం వచ్చినపుడు పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటోంది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలి.

-అప్పరబోతు దుర్గాప్రసాద్, మండపేట

కార్యక్రమంలో పాల్గొన్న కందికుప్ప హైస్కూల్ (2005-06) బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని కందికుప్ప జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 2005-2006 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2005-2006 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికను నిర్వహించి పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఒకరిని ఒకరు కలుసుకొని వారి వారి కుటుంబాల పరిస్థితులను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన రోజుల్లో గత స్మృతులను నెమరు చేసుకున్నారు. పాఠశాల స్థాయి విద్యను అభ్యసించిన రోజులు ఎంతో విలువైన రోజులని ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తపరిచారు. తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే వారికి అందరూ కలిసికట్టుగా ఆర్థిక సహాయం అందిస్తామని, అలానే పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. 15 సంవత్సరాల తర్వాత ఈ పాఠశాలలో తమ విద్యార్థులను తోటి ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో.ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు సిహెచ్.సన్నీ కుమార్, ఎన్.నరేష్ రాజ్, పండు సత్యనారాయణ, ఎస్ఎన్.మూర్తి, టి.సత్య వెంకట ప్రసాద్, కె.సంధ్య, వి.సంతోషి, ఐ.విజయ దుర్గ, కె.లోవ కుమారి, ఎన్.గంగ భవాని తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే చోట్ల రోడ్డుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ సలాది ఊర్మిళదేవి తెలిపారు. విలసవిల్లి పంచాయతీ గానుగచెరువు జగనన్న కాలనీలో జిజిఎంపి నిధులు రూ.12 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్ నిర్మాణ పనులను శనివారం సర్పంచ్ ఊర్మిళదేవి ప్రారంభించారు. వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్,నాయకులు కోలా ఏసు,బళ్ల సతీష్ ఉంగరాల నాగేశ్వరరావు, పెదపూడి రత్నం, కొల్లు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

కిట్లు పంపిణీ చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

సంక్రాంతి సందర్భంగా వెంకటాయపాలెం గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గ్రామ నౌకరులకు జనసేన ఎంపిటిసి సభ్యురాలు కణితి వెంకటేశ్వరి రాంబాబు ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు నగదు, గాజు గ్లాసులను పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా జనసేన పార్టీ పిలుపులో భాగంగా వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పోతాబత్తుల విజయ కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షులు మంచం పాపారావు, నాని, గంధం ఉమా శంకర్, పెద్దిరెడ్డి దొరబాబు తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకులకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

రెండవరోజు శనివారం వల్లూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన ఇన్చార్జి లీలా కృష్ణతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు పెట్టుకుని.. మోకాళ్లపై నిల్చుని

- 33వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

రామచంద్రపురంలో గోరింటాకు పెట్టుకుంటూ అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్ల సాధన కోసం గత 33 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. శనివారం జిల్లాలో అంగన్‌వాడీలు పలు విధాలుగా నిరసన తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

అమలాపురం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ వద్ద 24 గంటల దీక్షుఎ శనివారం అమలాపురం ప్రాజెక్టు కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా 24 గంటల దీక్షను సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం, అంగన్ వాడీ జిల్లా అధ్యక్షులు బండి వెంకటలక్ష్మి, ముమ్మిడివరం సెక్టార్ అధ్యక్షులు కె.వెంకటలక్ష్మి దీక్షా శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అంగన్‌వాడీ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. డిమాండ్లు పరిష్కారం జరిగే వరకూ ఈ సమ్మె కొనసాగుతుందని అన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని లేకుంటే ఉద్యమం మరింత ఉధతం చేయడానికి సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నపూర్ణ, వెంకటలక్ష్మి, హేమలత, దేవి, మంగతాయారు, అరుణ, సత్య, గౌతమి, దుర్గభవాని, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** సమ్మెలోభాగంగా అంగన్‌వాడీలు చేతులకు గోరింటాకు పెట్టుకుని నిరసన తెలియ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాల అంగనవాడీలు మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ధర్నాలో పాల్గొన్నారు. ధర్నా లో సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, అంగనవాడీ జిల్లా కార్యదర్శి దుర్గమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వీరలక్ష్మి, దీక్షా శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగన్వాడి అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు పిలిచి జీతాలు పెంచుతాం, ఎంత పెంచుతామో చెప్పం, జూన్ లో పెంచుతాం అనడం ప్రభుత్వ మొండి వైఖరికి నిదర్శనం అన్నారు. సమ్మెలో అంగనవాడీ నాయకులు వాసంశెట్టి సూర్యకుమారి, కె.విజయలక్ష్మి, జి.శ్రీదేవి, జహరా, దుర్గ, వెంకటరత్నం, జి.దేవి, వీర వేణి, 2 మండలాల అంగన్‌వాడీ వర్కర్లు, సుమారు 400 మంది పాల్గొన్నారు. **ముమ్మిడివరం** సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అధ్యక్షకార్యదర్శులు జయ లక్ష్మీ, దుర్గా మల్లేశ్వరీల ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్‌వాడీ వర్కర్లు మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు.ఈ శిబిరాన్ని దుర్గా ప్రసాద్ సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు గత 33 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం దిగి రాకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు నిరసన కొనసాగుతుందన్నారు. పండగ రోజుల్లో సైతం అంగన్ వాడీ మరింత దృఢ సంకల్పంతో సమ్మెలో పాల్గొని డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్‌వాడీలు 33 ఆకారంలో కూర్చుని ప్రభుత్వానికి నీరసన తెలిపారు. ఈ నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీలు తమకు గౌరవ వేతనం వద్దు, కనీస వేతనం కావాలి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నిరసనలో సెక్టార్ లీడర్ ధనలక్ష్మి, జి.శ్రీదేవి, జి.మంగాయమ్మ, వి.తలుపులమ్మ, ఎన్.విజయ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు సహాయకులు తదితరులు పాల్గొన్నారు. **మండపేట** స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేది లేదన్నారు. వెంటనే వేతనాలు పెంచుతున్నట్లు మరో జిఒ ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. వర్కర్లతో సమానంగా మినీ వర్కర్లకు వేతనాలు పెంచాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలన్నారు. ఆయిల్, కందిపప్పు, క్వాంటిటీ పెంచాలి. సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో మండపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడిలు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో మోకాళ్లపై నిల్చుని అంగన్‌వాడీల నిరసన

అమలాపురంలో దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు, ప్రజాసంఘాల నాయకులు

మండపేటలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'

రమేష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి శ్రేణులు

రాష్ట్ర ఎంబిసి కన్వీనర్‌కు సత్కారం

ప్రజాశక్తి-అయినవిల్లి

టిడిపి రాష్ట్ర బిసి సాధికారిక ఎంబిసి కన్వీనర్ పెంద్ర రమేష్ ను టిడిపి శ్రేణులు ఘనంగా సత్కరించారు సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య, రాష్ట్ర బిసి పెడరేషన్ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి సత్య, ఎంబిసి డైరెక్టర్ ఎడ్లపల్లి తుక్కియ్య శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెమెంటో అందజేశారు. జిల్లా ఎస్‌సి నాయకులు చిన్నం బాల విజయారావు, టిడిపి శ్రేణులు రమేష కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

ముగిసిన బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి-అమలాపురం

స్వామి వివేకానంద జయంతి యువజన దినోత్సవం సందర్భంగా కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2వ గోదావరి జోనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలు ఆఫీసర్స్ క్లబ్ నందు శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు జరిగాయి. ఈ పోటీల్లో కోనసీమ జిల్లాకు చెందిన ఎం. జగన్ టైటిల్ విన్నర్‌గా, కాకినాడ జిల్లాకు చెందిన టి ప్రశాంత్ టైటిల్ రన్నర్‌గా, టీం ఛాంపియన్ షిప్ విన్నర్ గా కాకినాడ జిల్లా, టీం ఛాంపియన్షిప్ రన్నర్ గా కోనసీమ జిల్లా కైవసం చేసుకున్నాయని ప్రెసిడెంట్ వంటేద్దు వెంకన్న నాయుడు తెలిపారు.ఈ పోటీలను తొలిత రాష్ట్ర టిడిపి నాయకులు మెట్ల వెంకటరమణ బాబుప్రారంభించగా పోటీల అనంతరం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి అమలాపురం డిఎస్‌పి అంబికా ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ క్రీడ వల్ల చక్కటి శరీర ఆకతితో బలంగా ఉండగలుగుతారని తెలిపి ప్రస్తుత కాలంలో వ్యాయామం అందరూ చేయాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధాన చేసినారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు డిఎంఆర్ శేఖర్ , ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ , ఆఫీసర్ క్లబ్ కార్యనిర్వాహ కార్యదర్శి రంకి రెడ్డి కాశీ విశ్వనాథ్ , పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎనుముల కృష్ణ పద్మరాజు, జంపన్న సుమన్ వర్మ తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** బాడీ బిల్డింగ్ పోటీల్లో మండలంలోని కలవచర్లకి చెందిన గ్రామ రెవెన్యూ అధికారి, మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షులు తాతపూడి అబ్బులు శనివారం గోల్డ్ మెడల్ సాధించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1994లో గౌతమి వ్యాయామ కళాశాల నందు అప్పట్లో సిల్వర్ మెడల్ సాధించానన్నారు. 30 ఏళ్ల తర్వాత మరల అమలాపురంలోనే గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

అమలాపురంలో జరిగిన పోటీల్లో విజేతలు

వైసిపి విజయానికి కృషి: జెడ్‌పిటిసి శైలజ

ప్రజాశక్తి- రాజోలు

వైసిపి అధిష్టానం ఎవరికి టిక్కెట్ కేటాయించినా పార్టీ గెలుపునకు కృషిచేస్తామని రాజోలు జెడ్‌పిటిసి సభ్యురాలు మట్టా శైలజ తెలిపారు. శనివారం ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. మట్టా శైలజా వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తూ రాజోలు టిక్కెట్ ఆశిస్తున్నారు. ఈ నెల 12న సిఎం జగన్‌ను కలిసిన శైలజ తనకు రాజోలు టిక్కెట్ కేటాయిస్తే వైసిపి విజయానికి కృషి చేస్తానన్నారు.

సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మట్టా శైలజ

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ర్యాలి గ్రామంలోమహిళలకు యువతకు వివిధ రకాల స్కిల్స్ అభివృద్ధి పరచడానికి స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద శామ్ జాదుగర్ మ్యాజిక్ ఫ్యామిలీ సౌజన్యంతో నిర్మించిన భవనాన్ని సౌభాగ్య గ్రూప్ అధినేత చిన్నం చంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కంప్యూ టర్ మరియు టైలరింగ్ మరియు బ్యూటీ పార్లర్ వంటి శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నారు. శ్యామ్ అన్నపూర్ణ తేజశ్రీ శ్రీకాంత్ డాక్టర్ మోహితులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఐ.పోలవరం పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

యానాం మద్యం పట్టివేత

ప్రజాశక్తి - ఐ.పోలవరం

యానాం నుంచి గుంటూరుకు కారులో మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం తెల్లవారు జామున పోలీసులు పట్టుకొన్నారు. వివరాలు ఇవి.. పాతఇంజరం-ఎదుర్లంక చెక్ పోస్టు వద్ద యానాం నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా 348 బాటిల్స్ పట్టుకొన్నారు. ఇవి రూ.1.48 లక్షలు విలువచేస్తాయని ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. **కాట్రేనికోన** మండల పరిధిలోని మత్స్యకార గ్రామమైన పల్లంలో యానాం మద్యం విక్రయిస్తున్న మల్లాడి వెంకట్రావు అలియాస్ సత్తీయను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. అతని నుంచి 254 యానాం మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా విక్రయం కేసులో ఇద్దరికి రిమాండ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక కుమ్మరి వీధిలో 20 లీటర్ల నాటు సారాతో పట్టుబడిన ఇద్దరు మహిళలకు కాకినాడ ఎక్సైజ్ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఎక్సైజ్ నార్త్ స్టేషన్ సిఐ కె.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో శనివారం సామర్లకోట కుమ్మర వీధిలో నాటుసారా విక్రయాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారా విక్రయిస్తున్న గుబ్బల పార్వతి, గుబ్బల వీరయ మ్మలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా ఇరువురికి 14 రోజులు రిమాండ్ ను కోర్టు విధించింది. అలాగే నాటు సారాను సరఫరా చేస్తున్న అదే ప్రాంతానికి చెందిన దంగేటి రాజు అనే వ్యక్తిపైనా ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిటిఆర్ నగర్ లోని తాడి నరసింహారావు స్వగృహం నందు శనివారం టిడిపి, జనసేన పార్టీల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. మాజీ ఎంఎల్‌సి రామచంద్ర రావు మాట్లాడుతూ సిఎం జగన్ అసమర్థ పాలన తో దేశంలోనే రాజధాని లేని ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నిలిచిందని గుర్తు చేశారు. నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతు వచ్చే ఎన్నికల్లో టిడిపి-జన సేన పార్టీల నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలన్నారు. జన సేన నియోజక వర్గ ఇన్ ఛార్జ్ పితాని బాలకష్ణ మాట్లాడారు. అనంతరం ఈనెల 20న మండపేట లో జరిగే రా - కదలిరా సమావేశానికి నియోజక వర్గం నుండి టిడిపి, జనసేన శ్రేణులు తరలివెళ్లాలన్నారు. సమావేశంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, గుద్దటి జమ్మి తదితరులుపాల్గొన్నారు.

రాష్ట్రంలో కుంటుపడిన అభివృద్ధి

ప్రజాశక్తి మండపేట

రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడి ఆందోళనాంధ్రప్రదేశ్ గా మారిందని అనపర్తి మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికులు, అంగన్‌వాడీలు అన్ని వర్గాల వారు ఆందోళన బాటపట్టారని దీంతో ఆంధ్ర ప్రదేశ్ ఆందోళనప్రదేశ్ గా మారిందన్నారు. ఉద్యోగులపై ఎస్మా ప్రయోగించి వారిని బెదిరించే పరిస్థితికి వైసిపి ప్రభుత్వం వచ్చిందన్నారు. నిత్యావసర సరుకులతో బాటు పెరిగిన విద్యుత్ ఛార్జీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుంటుపడిన అభివృద్ధి సంక్షేమాలు గాడిన పరిచేందుకు జనసేనతో కలిసి చంద్రబాబు మేనిఫెస్టో రూపొందించారన్నారు. ఈనెల 20న జనసేన-టిడిపి ఆధ్వర్యంలో జరిగే చంద్రబాబు నాయుడు రా కదలిరా బహిరంగ సభను విజయవంతం చేసి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-ఆలమూరు

చింతలూరులో టిడిపి గ్రామ అధ్యక్షుడు వైట్ల గంగరాజు, చింతలూరు ఫణీంద్ర కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం యువత పార్టీలో చేరారు. వారికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. పెదపల్లకు చెందిన వైసిపి నాయకుడు నడిపల్లి వెంకటేశ్వరరావు, మరికొందరు టిడిపిలో చేరారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - కోటనందూరు, రౌతులపూడి, కాజులూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, గుండాట, ఇతర జూదాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బి.శంకర్రావు హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా ఊరి విడిచి వెళ్లేవారు ఇంటిని భద్రపరుచుకోవడం కోసం తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అలాగే రౌతులపూడి మండలంలో సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందేలు, ఇతర జూదాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అబ్దుల్ నబీ శనివారం హెచ్చరించారు. మండలం లోని 26 గ్రామపం చాయతీలో ఆటో ద్వారా ప్రసారం నిర్వహిం చారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కాజులూరు మండలంలో సంక్రాంతిని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ బి.సాయి సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం మండలం లోని గొల్లపాలెం, ఆర్యవటం, జగన్నాధగిరి, కాజులూరు గ్రామాల్లో గతంలో కోడిపందేలు నిర్వహించిన ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తులసీరామ్‌చ రెవిన్యూ అధికారులు ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్రాంతి ఏదీ..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీలకు సంక్రాంతి పండుగ సందడి లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా విధించడం పట్ల సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని 33 రోజులుగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెబట పట్టిన విషయం విదితమే. జిల్లావ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీల కుటుంబాలు క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు సైతం దూరమై వీధుల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం కనీసం ఆలోచన చేయకపోవడం నియంతృత్వ వైఖరిని దర్పనం పట్టింది. అత్యవసర సర్వీసుల పరిధిలోకి తీసుకొచ్చి ఎస్మా ప్రయోగించడం చట్టవిరుద్ధమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో అంగన్‌వాడీ ఉద్యమం పట్ల అనుచితంగా వ్యవహరించిన విషయం విదితమే. గుర్రాలతో తొక్కించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే టిడిపి దాదాపు పదేళ్ల అధకారానికి దూరమైంది. వైసిపి ప్రభుత్వమూ రాబోయే రోజులలో అధికారానికి దూరం కావటం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చంద్రబాబు రాకతో టిడిపిలో ఉత్సాహం

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు రాకతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదలైన అనంతరం తొలిసారి ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడలో నిర్వహించిన సభకు చంద్రబాబు హాజరయ్యారు. వైసిపి నేతలు తిన్నదంతా కక్కిస్తామంటూ తనదైన శైలిలో విరుచుకు పడ్డారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు జనసేన, టిడిపి ఉమ్మడి జాబితా విడుదల చేయనున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అధినేత రాక ప్రత్యేకత సంతరించుకుంది. దీంతో జిల్లాలోని పార్టీ ముఖ్యనేతలు అధినేతను కలిసేందుకు క్యూ కట్టారు. ఎవరికీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. గత వారంలో జనసేన అధినేత సైతం జనసేన నేతలతో సమీక్షలు నిర్వహించారు. ఆ రెండుపార్టీల సీట్ల సర్దుబాట్లుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆశావహులంతా తమలో ఉత్సాహాన్ని నింపేలా ప్రకటన చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ముగ్గుల పోటీలతో మహిళలకు ఎర

సంక్రాంతి సంబరాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల పేరుతో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన కూటమి మహిళా ఓటర్లకు బహుమతులు ఎర వేయడంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కాసు బంగారం, బైకులు పంపిణీ చేయటం చర్చనీయాంశమైంది. మరి కొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నాలుగేళ్లలో క్రీడాకారులకు ఎటువంటి ప్రోత్సాహం ఇవ్వని వైసిపి ప్రభుత్వం ఆడుదాం- ఆంధ్రా పేరుతో పలు రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. విజేతలకు నగదు బహుతమతులు ప్రకటించడంతో పాటు రూ.100 కోట్ల బడ్జెట్ కేటాయించడం విమర్శలకు దారి తీసింది. మొత్తం మీద ఎన్నికల ప్రకటనకు ముందే ఓటర్లను ప్రలోభాల ఎరవేసేందుకు ఆయా పార్టీలు పోటీపడుతున్నాయి.

హోమ్ మినిస్టర్ ఇలాఖాలోనూ కోడి పందేలు

సంక్రాంతి నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలకు రంగం సిద్ధమవుతోంది. పోలీసు, రెవెన్యూ అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. సాక్షాత్తూ హోం మంత్రి ఇలాఖాలో కోడి పందేలకు బరులు సిద్ధం చేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఎస్పి జగదీష్ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు క్షేత్రస్థాయి పర్యటించి పలు బరులు ధ్వంసం చేశారు. ఈ జాబితాలో హోమ్ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొవ్వూరు, అనపర్తి ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణరెడ్డి నియోజక వర్గమైన అనపర్తి లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

ప్రజాశక్తి-కాట్రేనికోన

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మాజీ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ నాగిడి నాగేశ్వరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని అడవి పేట గ్రామంలో నవభారత్ రూరల్ డెవలప్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులు పాటు నిర్వహించే ఈ క్రికెట్ టోర్నమెంట్లో యువత ఆసక్తిగా పాల్గొనడం శుభపరిణామం అన్నారు. ఈ టోర్న మెంట్లో విజేతలకు రూ.30 వేల నగదు బహుమతులను, రన్నర్కు రూ.15 వేల నగదు బహుమతిని అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ ఫౌండర్, ఛైర్మన్ అంగాడి రేవతి, ప్రెసిడెంట్ రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రవీణ్ పుట్టినరోజు

ప్రజాశక్తి-అమలాపురంరూరల్

ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ సునీత

ఆంధ్ర సేవారత్న, డొక్కా సీతమ్మ నేషనల్ అవార్డు గ్రహీత, అమలాపురం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎఒం కరాటం ప్రవీణ్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రెడ్డిపల్లి లో ప్రవీణ్ నివాసం వద్ద పలువురు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రవీణ్ పలువు రుకి నగదు, వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రైవేటు కాలేజ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కరాటం నరసింహా రావు, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్ర మూర్తి, ప్రిన్సిపల్ కె.మనోహర్, రాజులపూడి మహేష్, సర్పంచ్ లు రేలంగి దుర్గారావు, పెనుమల సునీత ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అనురాధ

ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం ఎంపీ చింతా అనురాధ తాడేపల్లిగూడెంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అల్లవరం మండలం తుమ్మలపల్లిలోని ప్రాచీన లక్ష్మణేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.75 లక్షల నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. అక్కడ ఆలయ ముఖద్వారం, ముఖ మండపం, ధ్వజ స్తంభం మొదలైనవి ఏర్పాటు చేసి ఆలయానికి పునర్వైభవం తీసుకురావాలన్నారు. లక్ష్మణేశ్వర స్వామి ఆలయ విశిష్టతను ఎంపీ వివరించారు. భక్తులకు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని మంత్రిని కోరగా, వారు సానుకూలంగా స్పందించారు.

ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మండపేట

ఏడిద గ్రామంలో దాతల సహకారంతో సంఘమేశ్వర స్వామి దేవస్థాన ముఖద్వారం నిర్మాణ పనులకు దేవస్థానం ఛైర్మన్ రామిశెట్టి శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, మండల వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

పోలీసులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - యానాం

యానాం పోలీసుశాఖ పరిధిలోని వివిధ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 87 మంది పోలీసులకు స్పెషల్ గ్రేడ్ ఉద్యోగన్నతులు కల్పిస్తూ పోలీసుశాఖ అండర్ సెక్రటరీ ఎంవి.హీరన్ జాబితా విడుదల చేశారు. వేతనం పెంపుతో ప్రమేయం లేకుండా పదేళ్ల పనిచేసిన కానిస్టేబుల్స్‌కు హెడ్ కానిస్టేబుల్‌గానూ, 15 ఏళ్ల దాటితే ఎఎస్ఐ, 25 ఏళ్ల దాటితే ఎస్ఐగా పదోన్నతి కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే యానాం పోలీసుశాఖలో పనిచేస్తున్న జెబివి.స్వామి, ఎస్.అప్పారావు, డి.చిట్టిబాబు, కె.సుబ్రహ్మణ్యం, పి.జితేష్‌కుమార్, డిఎల్ సీతారత్నం, కెవి.రమణమూర్తి, డి.పట్టాభి రామయ్య, జెబివి.సుబ్బారావు, పి.సత్య నారాయణ, పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, సంపత్ కుమార్ తదితరులకు ఎస్ఐలుగా, కోన సర్వేశ్వరరావు తదితర 33 మందిని ఎఎస్ఐలుగా, 42 మందికి హెడ్ కానిస్టేబుల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పించినట్లు చెప్పారు. సంక్రాంతి పండగ రోజుల్లో వారు ఉద్యోగోన్నతి పొందడం సంతోషకరమని అన్నారు. వీరికి బంధుమిత్రులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

దాతకు చిత్రపటం అందజేస్తున్న ఛైర్మన్

అన్నదానానికి రూ.25వేల విరాళం

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ శాశ్వత అన్నదాన నిధికి దాత విరాళం శనివారం అందజేశారు. కొమరాడవాసులు కేతా శ్వేతలత పుట్టినరోజు ప్రతి ఏటా డిశంబర్ 28న అన్నదానం జరిపించేందుకు ర రూ.25వేలు విరాళం ఇచ్చారని ఆలయ సహాయకమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. దాతకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. శనివారం ఆదాయం రూ.2.41లక్షలు. టిక్కెట్‌ల విక్రయాల ద్వారా రూ.1,24,126, ఆదాయం రాగా నిత్యాన్నదాన విరాళాలు ద్వారా రూ.1,16,561 మొత్తం రూ.2,41,126లు ఆదాయం వచ్చిందన్నారు. 3,072మంది స్వామి వారి దర్శనము చేసుకోగా 2049మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

హోమశాల ప్రారంభం

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి సన్నిధిలో నూతన ఆలయ ప్రాంగణం వద్ద నూతన హోమశాలను దాతలు అంబాజీపేట మండలం మాచవరం మాజీ సర్పంచ్ సుంకర బాలాజీ సత్యవేణి దంపతులచే రూ.4 లక్షల వ్యయంతో నిర్మించారు. హోమశాలను శనివారం స్థానిక ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు ప్రారంబించారు.. తదుపరి పాత దేవాలయం చుట్టూ మరియు కళ్యాణ కట్ట చుట్టూ ఫ్లోరింగ్ ప్రారంభించారు. ఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ టోర్నీ

ప్రజాశక్తి - కాకినాడ

ఆఫీసర్స్ క్లబ్ మార్నింగ్ స్టార్స్ షటిల్ టోర్నీ ఉత్సాహంగా ముగిసింది. విన్నర్స్‌గా యు రామకృష్ణ, నవీన్ నిలిచారు. సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం కాకినాడ ఆఫీసర్స్ క్లబ్ లో షటిల్ టోర్నీ నిర్వహించారు. లీగ్ పద్ధతిలో జరిగిన ఈ టోర్నీలో సుమారు 16 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో రన్నర్స్‌గా తాతాజీ, పీటర్ నిలిచారు. అనంతరం విజేతలకు షీల్డ్‌లు అందజేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ఆత్రేయపురంలో పడవల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం పలు చోట్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ వేషధారణలు, డూడూబసవన్నలు, రంగవల్లులు, భోగిమంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పడవలు పోటీలు, ముగ్గుల పోటీలు జరిగాయి.

ఆత్రేయపురం సంక్రాంతి సంబరాలలో భాగంగా సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ పేరుతోనే ఎంఎల్ఎ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ప్రధాన పంట కాలువలో నాలుగు రోజులు పాటు పడవల పోటీలు మరియు ఇతర పోటీలు నిర్వహిస్తున్నారు. ఎంఎల్ఎ చిర్ల జగ్గి రెడ్డి శనివారం ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతను ఒలింపిక్స్ స్థాయి పోటీలు అయిన పడవల పోటీల వైపు ఆకర్షించాలనే ఉద్దేశ్యంతో ఈ పడవల పోటీలను ఏర్పాటు చేశామని అన్నారు. కేరళలో మాత్రమే జరిగే ఈ తరహా పోటీలను మొట్టమొదటి సారి ఆంధ్రప్రదేశ్లో అదీ మన కోనసీమలోని ఆత్రేయపురం గ్రామంలో నిర్వహించడం అదష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీలను నియోజకవర్గంలో ప్రజలు యువత ఈ పోటీలను తిలకించి విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కా ఛైర్మన్ కప్పల శ్రీధర్, కొల్లి సామ్సన్, కనుమూరు శ్రీనివాసరాజు, సర్పంచ్ పాల నాగేశ్వరరావు, ముదునూరి గణపతిరాజు, పెనుమత్స సురేష్ రాజు, తదితరులు పాల్గొన్నారు. లొల్ల గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన ప్రవాస ఆంధ్రుడు ఇండుగుల సప్తగిరీష్ సహకారంతో సంక్రాంతిని పురస్కరించుకుని వాలీ బాల్ పోటీలు, రంగవల్లుల పోటీలు నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు .ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **మండపేట** మండలంలోని తాపేశ్వరం గ్రామంలో మడత కాజా మాత సంస్థ సుచి ఫుడ్స్ లో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే వివిధ రకాల పిండి వంటలు అమ్మకానికి సిద్ధం చేయగా వేడివేడిగా స్నాక్స్ అందించేందుకు స్పెషల్ చాట్ ఏర్పాటు చేశారు శనివారం సాయంత్రం నుంచి సూచిలో పండగ వాతావరణం నెలకొంది. **రాజోలు** విప్రో ఎంటర్ ప్రైజెస్ సంతూర్ ఆధ్వర్యంలో రాజోలు పాత ఆంధ్రబ్యాంకు వీధిలో ఏర్పాటు చేసిన రంగవల్లుల పోటీలు అందరినీ అలరించాయి. రాజోలు ఎంఇఒ-2 తాడి ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ముగ్గుల పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో సంతూర్ డిస్టిబ్యూటర్ పద్మనాభ స్వామి, న్యాయ నిర్ణేతలు రమణ,విజయ కిషోర్, బోళ్ళ పద్మ, స్థానిక నాయకులు ఆడబాల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** పెదపట్నం చిన్నవీధిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురికి నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు జాలెం శ్రీనివాస్ రాజా, గ్రామ శాఖఅధ్యక్షులు పుచ్చల శేఖర్ తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి పిల్లలు భోగి పిడకలు వేస్తూ భోగి దండలు సిద్ధం చేసుకున్నారు. గ్రామాల్లో హరిదాసులు సంకీర్తనలు పాడుతూ ఇంటింటికి తిరుగుతూ సందడి చేస్తున్నారు.డూడూ బసవన్నలు గంగిరెద్దులతో వీధుల్లో తమ కళారూపాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇ క జంగమ దేవరలు బుడబుక్కల వేషధారులు గ్రామాల్లో తిరుగుతూ తెలుగు సంస్కతి సాంప్రదాయాలను గుర్తు చేస్తున్నారు. **ముమ్మిడివరం** సంక్రాంతి వేడుకలు మరియు యువజనోత్సవాలను పురస్కరించుకుని రారాజు జిమ్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు శనివారం బహుమతుల ప్రదానం జరిగింది. పళ్ళవారి పాలెం వివేకా నంద వారది వద్ద స్పోర్ట్స్ అకాడమీ ఛైర్మన్ రారాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొప్పిశెట్టి కష్ణ మూర్తి చేతులు మీదుగా వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మానసిక వైద్యుడు గంగరాజు గోధాశి నాగేశ్వరరావు వేగిరౌతు రాజబాబు, చిక్కం శ్రీను, వడ్డీ సత్యనారాయణ, గోదశి పుండరీష్, కె.రాధా కష్ణ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో కె.గంగవరం మండలంలోని సత్యవాడ గ్రామం లో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఆ గ్రామ ప్రజలతో నాయకులు జనసేన పార్టీ ఇంఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టిడిపి ఇంఛార్జి రెడ్డి సుబ్రమణ్యం నిర్వహించారు. అనంతరం ముగ్గులు పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అంద జేశారు. భోగి మంటలను వెలిగించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజోల్లో ముగ్గుల పోటీలు

ఉప్పలగుప్తం మండలంలో డూడూబసవన్న

మండపేటలో సురుచి వద్ద సంక్రాంతి వేడుకలు

మామిడికుదురు మండలం పెదపట్నంలో ముగ్గుల పోటీలు

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

పరామర్శిస్తున్న ఎంఎల్ఏ వేగుళ్ల, రాంబాబు

పట్టణంలో ఇటీవలె మరణించిన పలు కుటుంబాల సభ్యులను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం పరామర్శి ంచారు. పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు అత్తయ్య బెజవాడ సత్యవతి, విలేకరి బొల్లోజు మల్లేశ్వరరావు కుటుంబాలను ఎంఎల్ఎ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎంపిటిసి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని అల్లిపూడి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఎంపిటిసి సభ్యురాలు నెమ్మది నాగమణి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వైసిపి మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపిపి లగుడు శ్రీనివాస్ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మానవతాదృక్పథంతో రూ.లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ లంక ప్రసాద్, గరిసింగు లచ్చరావు, గోవర్ధన, వార్డు సభ్యులు రమణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు పెద్దాపురం మండలం జె.తిమ్మాపురం గ్రామంలో గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శనివారం రైతులకు ఎలుకల నివారణ పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎస్.అలీసియా నర్మీన్, ఎస్‌కె.బీబీ ఫాతిమా, ఆర్.దీప్తిరాణి, జి.లక్ష్మీతులసి, వి.లహరిలతో కూడిన బృందం ఎలుకల నివారణ మందు తయారీ, వాటిని వినియోగించే పద్ధతి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. బ్రోమోడయోలోన్, వంటనూనె, వరి నూకలను 2 : 2: 96 నిష్పత్తిలో కలిపి 10 నుంచి 15 గ్రాముల మిశ్రమాన్ని చిన్న చిన్న పొట్లాలు కట్టి ఎలుకల బొరియల వద్ద పెడితే ఎలుకలు వాటిని తిని మరణిస్తాయన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు కాకినాడ ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ సం యుక్తంగా నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టి వల్ కు కాకినాడ గోడరిగుంట మదర్ థెరీసా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న కెఆర్ఎస్.చంద్రారెడ్డికి ఆహ్వానం అందింది.

జీవశాస్త్ర బోధనలో నూతన పోకడలు అనే అంశం పై పరిశోధన పత్రాన్ని ఈ సదస్సులో సమర్పిస్తారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఈ నెల 17 నుంచి 20 వరకూ జరగనున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ దేశ విదేశాల శాస్త్రవేత్తలతో పాటు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడి పాల్గొంటారు. ఎంపికైనా ఉపాధ్యాయుడు కెఆర్ఎస్. చంద్రారెడ్డిని ప్రాంతియ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యా శాఖాధికారి జి.నాగమణి, అదనపు సంయుక్త సంచాలకులు, విద్యాశాఖ పి.నాగేశ్వరరావు, కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జె.డేనియల్ రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎమ్.శ్రీనివాస్ వినీల్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు ఎంఇఒలు విపిజి. వాణీ కుమారి, సిహెచ్.రవి, పాఠశాల హెచ్ఎం వై.శ్రీనివాస్ అభినందించారు.

దస్తావేజు పోయినది

నా క్లయింట్లు అయిన కాకినాడ, సాంబమూర్తి నగర్, జ్యోతుల కాలనీ, డో.నెం. 16-33-94రు కాపురస్తులు **(లేటు) మహమ్మద్ చాన్ భాషా గారి కుమారులు అయిన 1) షేక్ అహమద్ మరియు 2) షేక్ అక్బర్ గార్లు** నాకు ఇచ్చిన సంజాయిషీమేరకు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.

తూర్పుగోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ సబ్-రిజిస్ట్రీలో చేరిన, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, సాంబమూర్తి నగర్, జ్యోతుల కాలనీ, వార్డు నెం. 2, బ్లాకు నెం. 11, ప్రజెంట్ బ్లాకు నెం. 16, టి.ఎస్. నెం. 835/2, 836/8 దాఖలా 112 చ॥గ॥లు లేక 93.64 చ॥మీ॥లు స్థలం, అందుల డో.నెం. 16-33-94రు గల ఇల్లు నా క్లయింట్లు యొక్క తండ్రి గారు కొనుగోలు చేసి, వారి జీవితకాలంలో నా క్లయింట్లుకు దఖలుపరచి ఉన్నారు. సదరు ఆస్తి తాలూకు లింకు దస్తావేజు అనగా నా క్లయింట్లు తండ్రిగారికి క్రియపర్చిన గంగాపాత్రుని జగదీశ్వరి పేరగల ది.28-07-1998 తేదీగల ఒరిజినల్ క్రియ దస్తావేజు నెం.4722/1998, SRO, కాకినాడను, నా క్లయింట్లు ది. 09-01-2024 తేదీన హౌసింగ్ లోన్ నిమిత్తం వారి ఇంటి వద్ద నుండి కాకినాడ, సూర్యారావుపేటలో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్దకు మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా, దారి మార్గంలో సదరు దస్తావేజు గల కవరు పడిపోయినది. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇఫ్తేఖార్ మహమూద్, అడ్వకేట్
డో.నెం. 5-2-43/1ఎ, మాదిరెడ్డివారి వీధి,
కాకినాడ. సెల్: 9848424875